




బీఎడ్ కళాశాలలకు ఎన్‌సీటీఈ ఝలక్..!

- 2025-26 గుర్తింపు రద్దు.. కొన్నింటికి నోటీసులు
- కఠినమైన చర్యల దిశగా ఉన్నత విద్యామండలి
- ఆర్‌యూ పరిధిలో చిక్కుల్లోపడ్డ యాజమాన్యాలు
- మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం: ఆర్‌యూ రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బీఎడ్ కళాశాలలకు అనుమతులు ఇచ్చే ఎన్‌సీటీఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్) చాలా కళాశాలలకు నోటీసులు జారీ చేసింది. గడిచిన మే 14న జరిగిన సమావేశంలో మౌలిక వసతులు లేని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 6 బీఎడ్, ఒక ఎంఎడ్ కళాశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి అనుమతులను రద్దు చేసింది. వాటిలో కొన్ని మూతపడగా మరి కొన్ని ప్రస్తుతం కోర్టు ఆర్డర్‌తో రన్నింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఎన్‌సీటీఈ నోటీసులు ఇస్తూ రద్దు చేయడంతో ప్రస్తుత విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వాటిలో శ్రీ సుధా- డోన్, శ్రీగాయత్రి- డోన్, శ్రీభారతి- నంద్యాల కళాశాలలకు ఎన్‌సీటీఈ నోటీసులు జారీ చేసినా అవి కొనసాగుతున్నాయి. 26, 27 మేలో ఎన్‌సీటీఈ 461 మీటింగ్‌లో 6 బీఎడ్, 3 ఎంఎడ్, 2 బీపీఎడ్ కళాశాలలను 2025-26 విద్యా సంవత్సరానికి రద్దు చేసింది. వాటిలో శ్రీశంకరాస్, ఎంఎడ్ కర్నూలు, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, ఆదోని బీపీఎడ్ రన్నింగ్‌లో ఉన్నప్పటికీ ఎన్‌సీటీఈ నోటీసులు ఇచ్చింది. ఇవి రద్దయిన కళాశాలల జాబితాలో ఉన్నాయి.

పీఆర్‌ఏ నోటీసులు..

ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు మౌలిక వసతులు, అధ్యాపకులు లేని కొన్ని కళాశాలలకు పీఏఆర్ (పర్ఫార్మెన్స్ అప్రైసల్ రిపోర్టు) ఫైనల్ నోటీసులు ఇచ్చింది. వాటిలో రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఎడ్-24, ఎంఎడ్ 9, బీపీఎడ్ 4 ఇవ్వగా కొన్ని మూతపడ్డాయి. మరి కొన్ని రన్నింగ్‌లో ఉన్నాయి. మరి కొన్ని కోర్టు ఆర్డర్‌తో కొనసాగుతున్నాయి.





ఉలిక్కిపడ్డ వర్సిటీ..

బీఎడ్ కళాశాలలకు ఎన్‌సీటీఈ నోటీసులు ఇవ్వడంతో రాయలసీమ యూనివర్సిటీ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సొంతంగా భవనాలు లేకున్నా కొన్ని బీఈడీ కళాశాలలు రన్నింగ్‌లో ఉండటంతో ఎన్‌సీటీఈ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసుల వ్యవహారం వర్సిటీ అధికారులకు తలనొప్పిగా మారింది. అధికారులు కొన్ని బీఈడీ కళాశాలలకు కోర్టు ఆర్డర్ నేపథ్యంలో అనుమతి ఇచ్చినప్పటికీ ఎన్‌సీఈటీ రద్దు చేయడంతో బీఈడీ కళాశాలల సమస్య వర్సిటీ అధికారులకు అంతుచిక్కడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యామండలి బీఎడ్ కళాశాలలపై కఠిన చర్యల దిశగా అడుగులు వేస్తోందని వర్సిటీ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్‌సీటీఈ నోటీసులపైన రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కూడా సీరియస్‌గా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

- రాష్ట్ర వ్యాప్తంగా చాలా బీఈడీ కళాశాలలకు ఎన్‌సీటీఈ గుర్తింపు రద్దయింది. రాష్ట్రంలోని చాలా కళాశాలలకు ఫైనల్ నోటీసులు కూడా అందాయి. ఈ నోటీసుల వ్యవహారంతో 2025-26 విద్యా సంవత్సరం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుందని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

మా దృష్టికి రాలేదు

నోటీసులు జారీ చేసినట్లు మా దృష్టికి రాలేదు. కనీసం మెయిల్ కూడా రాలేదు. ఆదేశాలు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం

- బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ

అడ్డగోలు అనుమతులు సరైన పద్ధతి కాదు



రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో కొన్ని బీఈడీ కళాశాలల గుర్తింపును ఎన్‌సీటీఈ రద్దు చేసినప్పటికీ వర్సిటీ అధికారులు మాత్రం వాటికి అడ్డగోలు అనుమతులు ఇస్తున్నారు. ఎన్‌సీటీఈ రద్దు చేసిన బీఈడీ కళాశాలలు, ఎన్‌సీటీఈ నోటీసులు అందుకున్న బీఈడీ కళాశాలల జాబితాను వర్సిటీ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

- స్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏబీవీపీ

మార్కెట్ యార్డు వెల వెల

- గతంలో అమ్మకానికి 26 పంట ఉత్పత్తులు
- ప్రస్తుతం 8 పంట ఉత్పత్తులే విక్రయానికి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఏడాది పొడవునా ప్రతి రోజూ 26రకాల పంట ఉత్పత్తులను రైతులు అమ్మకానికి తీసుకువస్తుంటారు. ఇప్పుడది ఎనిమిది పంట ఉత్పత్తులకు పడిపోయింది. ఏటా మార్చి నుంచి ఏప్రిల్ వరకు కర్నూలు మార్కెట్ యార్డు పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలతో, రైతుల సందడితో కోలాహలంగా ఉంటుంది. పది రోజుల నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు వివిధ ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాలతో పాటు పక్క రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణల నుంచి రైతులు పంట ఉత్పత్తులను తీసుకురావడం పూర్తిగా తగ్గిపోయింది. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 47 క్వింటాళ్ల వేరుశనగకాయలు మాత్రమే రైతులు అమ్మకానికి తెచ్చారు. గరిష్ఠ ధర క్వింటానికి రూ.5,819, మధ్యస్థ ధర రూ.5,111, కనిష్ఠ ధర రూ.2,222 రైతులకు అందిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా పూల విత్తనాలు, ఆముదాలు ఒక క్వింటా కూడా అమ్మకానికి రాలేదు. వాము కేవలం 137 క్వింటాళ్లు మాత్రమే అమ్మకానికి రాగా, గరిష్ఠ ధర రూ.16,688, మధ్యస్థ ధర రూ.14,460, కనిష్ఠ ధర రూ.2,669 రైతులకు దక్కింది. మొక్కజొన్నలు కేవలం 9 క్వింటాళ్లు మాత్రమే అమ్మకానికి రాగా, గరిష్ఠ ధర, మధ్యస్థ ధర రూ.1,859, కనిష్ఠ ధర రూ.400 మాత్రమే దక్కింది. కందులు 360 క్వింటాళ్లు రాగా, గరిష్ఠ ధర రూ.6,412, మధ్యస్థ ధర రూ.6,292, కనిష్ఠ ధర రూ.2,406 పలికాయి.

హంద్రీనీవా పనులు 80శాతం పూర్తిచేశాం

- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ చీఫ్ ఇంజనీర్ నాగరాజు



హంద్రీనీవా గండికి కారణమైన చిన్నవోణి వంకను పరిశీలిస్తున్న సీఈ

పత్తికొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా విస్తరణ పనులు 80శాతం మేర పూర్తిచేశామని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ చీఫ్ ఇంజనీర్ నాగరాజు అన్నారు. కర్నూలు ఎస్ఈ పాండురంగయ్య ఇతర అధికారులతో కలసి ఆయన శుక్రవారం హంద్రీనీవాకాలువ విస్తరణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పందికోన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేళ్ల కాలంలో హంద్రీనీవా విస్తరణ పనులు ఇంతవేగంగా జరిగింది ఈఏడాదేనన్నారు. మిగిలిన 20శాతం పెండింగ్ పనుల్లో క్రిష్ణగిరి నుంచి నరశ్యామల వరకు ఎక్కువగా ఉన్నాయన్నారు. శ్రీశైలంలో ఇప్పటికే 110 టీఎంసీలకు నీటిమట్టం చేరుకుందని జూలై మొదటివారంలోగా నీటిమట్టం పెరుగుదలను బట్టి ప్రభుత్వం హంద్రీనీవా కాలువకు నీటిని విడుదలచేసే అవకాశాలు ఉన్నాయన్నారు. పందికోన సమీపంలో గండికి కారణమైన చిన్నవోణి వంకను పరిశీలించారు. ఆయనతోపాటు ఈఈలు చంద్రశేఖర్‌రెడ్డి, శరత్‌కుమార్, డీఈలు ప్రసాద్‌బాబు, కేశవరెడ్డి, ఏఈ రాజశేఖర్‌లు ఉన్నారు.

ఈవీఎంలపై నిరంతర నిఘా



గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధుల బీజేపీ సాయి ప్రదీప్, జనసేన మంజునాథ్, బహుజన సమాజ్‌వాదీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అరుణ్ కుమార్, టీడీపీ తెలుగు యువత వైస్ ప్రెసిడెంటు పి.రాజు, కాంగ్రెస్ బజారన్న పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను పాటిస్తూ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగుల బదిలీల అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28, 29 తేదీల్లో సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. బదిలీల ప్రక్రియ ఈ నెల 30వ తేదీ నాటికి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారికి ఖచ్చితంగా బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దివ్యాంగులు, వితంతువులు, స్పౌజ్ కేసులకు సంబంధించి జీవోఎంఎస్. నెం.4, 5 ప్రకారం రిక్వెస్టు బదిలీలను చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఆర్వో నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ రామచంద్రరెడ్డి, డీఎంహెచ్‌వో శాంతికళ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాస్, డీపీవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యకు కొర్రీలు..!

- విద్యార్థులకు ప్రవేశం కల్పించని ప్రైవేట్ స్కూళ్లు
- ఆందోళనలో తల్లిదండ్రులు.. డీఈవో కార్యాలయం ముట్టడి
- జిల్లాలో 262 స్కూళ్లకు విద్యా శాఖ నోటీసులు
- 2,235 మంది పేద విద్యార్థులకు 'ఉచిత విద్య' ప్రశ్నార్థకం



డీఈవో శామ్యూల్ పాల్‌ను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలనే విద్యాహక్కు చట్టానికి జిల్లాలో పలు ప్రైవేటు విద్యా సంస్థలు తూట్లు పొడుస్తున్నాయి. లేనిపోని కొర్రీలు పెడుతూ విద్యాహక్కు చట్టం కింద ఎంపికైన విద్యార్థులకు పాఠశాలల్లో అడ్మిషన్లు ఇవ్వడం లేదు. ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా పలు పాఠశాలల యాజమాన్యాలు కుంటిసాకులతో అవాంతరాలు సృష్టిస్తూ ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పైసా ఖర్చు లేకుండా తమ పిల్లలకు పదేళ్లు ఉచిత విద్య అందుతుందని భావిస్తే.. ఫ్రీ సీటు అయినా సరే ఫీజులు కట్టాల్సిందేనని యాజమాన్యాలు అంటున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలని శుక్రవారం తల్లిదండ్రులు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. డీఈవో శామ్యూల్ పాల్‌ను నిలదీశారు. విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద ఉచిత విద్య అందించాలని జిల్లాలో తొలి విడతలో 384 పాఠశాలలకు 2,289 మంది విద్యార్థులను కేటాయించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఈ నెల 5లోగా అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించారు. నెల రోజులైనా ఇప్పటి వరకు కేవలం 1,110 మంది విద్యార్థులకే ప్రవేశం కల్పించారు. 1,179 మంది విద్యార్థులకు వివిధ కొర్రీలు పెట్టి అడ్మిషన్లు తిరస్కరిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. అత్యధికంగా కర్నూలు అర్బన్ పరిధిలో 91 పాఠశాలల్లో 840 విద్యార్థులను కేటాయిస్తే 362 మందికి, కల్లూరు అర్బన్ పరిధిలో 71 పాఠశాలలకు 463 మంది విద్యార్థులను కేటాయిస్తే 160 మందికి, ఆదోనిలో 71 పాఠశాలలకు 320 మందిని కేటాయిస్తే.. 238 విద్యార్థులకే అడ్మిషన్లు ఇచ్చారు. కర్నూలు, కల్లూరు అర్బన్ పరిధిలో 781 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందని ద్రాక్షగా మారింది. రెండో విడతలో 173 పాఠశాలలకు 1,059 విద్యార్థులను కేటాయించారు. అత్యధికంగా కర్నూలు అర్బన్ పరిధిలో 52 పాఠశాలలకు 453, కల్లూరు అర్బన్ పరిధిలో 46 పాఠశాలలకు 331 విద్యార్థులను కేటాయించారు. మా పిల్లలకు ఉచిత విద్య అందించాలని గర్జించారు. కుంటిసాకులతో కొర్రీలు పెడతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో డీఈవో సమావేశం అయ్యారు. కాగా.. రెండేళ్లుగా తమకు ప్రభుత్వం ఆర్‌టీఐ బకాయిలు చెల్లించలేదు.. అప్పులు చేసి ఉచిత విద్యను అందించడం ఎలా సాధ్యం..? అని ప్రైవేటు పాఠశాలల యజమానులు కొందరు వాపోతున్నారు.

రెండో విడతలో అందరికీ ప్రవేశాలు కల్పిస్తాం



తొలి విడతలో 384 పాఠశాలలకు 2,289 మంది విద్యార్థులను కేటాయిస్తే 1,110 మంది విద్యార్థులకే ప్రవేశం కల్పించారు. 1,179 మంది అడ్మిషన్లు ఇవ్వలేదు. 262 పాఠశాలలకు నోటీసులు జారీ చేశాం. తొలి విడత సీట్లు రద్దు చేశారు. రెండో విడతలో 1,059 మంది విద్యార్థులకు ఉచిత విద్య సీట్లు కేటాయించాం. రెండో విడతలో అందరికీ ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

- శామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు

పుస్తకాలు కూడా ఇవ్వడం లేదు



రెక్కాడితే తప్ప పూటగడవని పేదరికం మాది. మా కూతురు మధుప్రియకు ఒకటో తరగతిలో అడ్మిషన్ కోసం విద్యా హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే.. అబ్బాస్‌నగర్‌లో ఉన్న రవీంద్ర విద్యానికేతన్ పాఠశాలకు కేటాయించారు. ఈ నెల 5న ధ్రువీకరణ పత్రాలు అందజేశాం. అడ్మిషన్ ఇవ్వడం లేదు. పుస్తకాలైనా ఇవ్వండి సారూ.. అని వేడుకున్నా ఇవ్వడం లేదు.

- లక్ష్మన్న, అబ్బాస్ నగర్, కర్నూలు

ఫోన్ చేసినప్పుడు రండి అంటున్నారు



ఒకటో తరగతిలో అడ్మిషన్ కోసం విద్యా హక్కు చట్టం కింద మా అబ్బాయి ప్రదీప్‌ను డీడీ పాడులో ఉన్న ఆదినా స్కూల్‌కు కేటాయించారు. అక్కడికి వెళితే ఫోన్ చేసినప్పుడు రండి అంటున్నారు. మీకు కేటాయించిన సీటు రద్దు అయ్యిందని అంటున్నారు. సరైన సమాధానం చెప్పడం లేదు. ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినా రెస్పాండ్ అవ్వడం లేదు.

- ఎం.రాజు, పందిపాడు, బీఆర్‌రెడ్డి కాలనీ

తొలి విడత సీట్లు రద్దు చేశారంటున్నారు



మా అబ్బాయి ఎస్. హరితేజ్‌కు ఎన్ఆర్ పేటలో ఉన్న సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ స్కూల్‌లో విద్యా హక్కు చట్టం కింద ఒకటో తరగతిలో మే 29న సీటు కేటాయించారు. ఈ నెల 5లోగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశాను. ఇప్పటి వరకు అడ్మిషన్ ఇవ్వలేదు. పాఠశాలలో అడిగితే తొలి విడత సీట్లు రద్దు చేశారు అంటున్నారు. ఇదెక్కడి న్యాయం?

- ఎస్.కేశవ్, కీర్తి దంపతులు, ఎన్ఆర్ పేట, కర్నూలు

అధికారుల్లో కలవరం..!

- ఆంధ్రజ్యోతి కథనంతో మొదలైన అలజడి
- చాంద్‌బాషా వ్యవహారంపై అటవీ, పోలీసు శాఖలు సీరియస్
- రూ.కోట్లు కొట్టేసిన కేసుపై ఆరా తీస్తున్న నంద్యాల ఎస్పీ
- యూనియన్ బ్యాంకు సిబ్బంది అప్రమత్తం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చాంద్‌బాషా

ఆత్మకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోనే సంచలనంగా మారిన ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని ఓ ఉద్యోగి చేతివాటం ప్రస్తుతం ఆ శాఖ అధికారులను కలవరానికి గురిచేస్తోంది. అంతేకాదు ఈయనతో చేతులు కలిపి అక్రమాలకు వంతుపాడిన ముఖ్య అధికారుల్లో అలజడి మొదలైంది. వాస్తవానికి ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఏళ్ల తరబడి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి 2024 జూలైలో రిటైర్డు అయిన చాంద్‌బాషా.. తన పని చేసిన సమయంలో ఫారెస్టు చెక్‌పోస్టుల నుంచి వచ్చిన ఆదాయాన్ని ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్)కు, ఇతర సంస్థలకు ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేసే ప్రక్రియలో చేతివాటం ప్రదర్శించి కోట్ల రూపాయలు స్వాహా చేశాడు. ఈ వ్యవహారంపై ఇప్పటికే అటవీశాఖ ఉన్నతాధికారులు చాంద్‌బాషాపై పోలీసు కేసు నమోదు చేయించడంతో పాటు అక్రమాలను వెలికితీసేందుకు ఆరుగురితో కూడిన ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. అయితే అప్పటికే పరారీలో ఉన్న చాంద్‌బాషాను పట్టుకోవడంతో పాటు ఆయన చేసిన అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికితీయడంలో ఆయా విభాగాల అధికారుల విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'నల్లమలలో కళ్లుగప్పి.. రూ.కోట్లు కొట్టేశాడు' కథనానికి పోలీసు, అటవీ, యూనియన్ బ్యాంకు అధికారులు అప్రమత్తమైనట్లు తెలిసింది. నిజానికి 2024 సంవత్సరంలోని ఏప్రిల్, మే నెలల్లో చాంద్‌బాషా సుమారు రూ.19లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు అటవీ అధికారులు గుర్తించారు.

మిగతా 7వ పేజీలో

సాంకేతికతతో నేరాల కట్టడి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడి చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో ఉన్న పెండింగ్ కేసుల గురించి ఎస్పీ ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళలో గస్తీలు పెంచాలన్నారు. గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని ఉర్దూ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సురేష్ తెలిపారు. అర్థశాస్త్రం, జంతుశాస్త్రం, లైబ్రేరియన్లలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీలోగా దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలన్నారు.

ఓర్వకల్లుకు మరో భారీ పరిశ్రమ

- స్థాపించేందుకు ముందుకొచ్చిన రిలయన్స్ సంస్థ
- రూ.1,622 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకు అనుమతి
- ఇండస్ట్రియల్ కారిడార్‌లో 80ఎకరాలు కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి



కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామికవాడ (ఇండస్ట్రియల్ కారిడార్)లో భారీ పరిశ్రమ స్థాపనకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చింది. రూ.1,622 కోట్ల పెట్టుబడితో స్థాపించే ఈ పరిశ్రమలకు 80 ఎకరాలు భూమి కేటాయించారు. పరిశ్రమ స్థాపనకు, భూకేటాయింపులకు అనుమతులు ఇస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఓర్వకల్లు సిగలో మరో భారీ పరిశ్రమ వచ్చి చేరింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు మొదలు పెట్టారు. రిలయన్స్ సంస్థ రూ.1,622కోట్లతో పెట్టుబడితో శీతలపానీయాలు, జ్యూస్, తాగునీరు తయారీ పరిశ్రమను కర్నూలు జిల్లాకు తీసుకురావడంతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉంది. సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి రిలయన్స్ యాజమాన్యాన్ని ఒప్పించి ఇక్కడకు తీసుకొచ్చారు. ఈ పరిశ్రమ ఏర్పాటు అయితే స్థానికంగా 1,200మందికి ప్రత్యేక్షంగా ఉపాధి లభిస్తే.. పరోక్షంగా మరో వందలాది మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఓర్వకల్లు ఏపీఐఐసీ ల్యాండ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసే అ పరిశ్రమకు ఎకరం రూ.30లక్షలు చొప్పున 80 ఎకరాలు కేటాయించారు. ఈ నెల 19న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం జీవో జారీచేసింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 ప్రకారం అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తారని తెలుస్తుంది. 2026డిసెంబర్‌లోగా ఉత్పత్తి ప్రారంభిం చేలా తక్షణమే పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వ లక్ష్యం. సంబంధిత శాఖ మంత్రి టీజీ భరత్ రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో పలుమార్లు సంప్రదించినట్లు తెలుస్తుంది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేశారు. పలు పరిశ్రమలు స్థాపనకు చర్యలు చేపట్టారు. అయితే.. 2019లో జగన్ ప్రభుత్వం రావడంతో లక్ష్యం మరుగున పడింది. ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ పరిశ్రమలు రావడంతో మొదలయ్యాయి. అదే క్రమంలో 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ ను రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. టెండర్లు కూడా పూర్తి చేసింది. వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు రాబట్టి, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యం. అందులో భాగంగా తాజాగా దేశంలో దిగ్గజ సంస్థల్లో ఒకటైన రిలయన్స్ ఓర్వకల్లు కేంద్రంగా భారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రావడం సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు భూమి పూజ చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ పరిశ్రమ కూడా మరో 400 ఎకరాల్లో విస్తరణకు చర్యలు చేపట్టింది.

జగన్ రీ సర్వేతో భూమి కోల్పోయా..

- 2 ఎకరాలకు గాను 1.32 ఎకరాలే చూపుతోంది
- వైరల్ అయిన వీడియోలో ఓ సైనికుడి ఆవేదన



జవాన్ షేక్ ఖలీల్

ఎమ్మిగనూరు/నందవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయంలో జగన్ చేపట్టిన భూ రీసర్వే వైఫల్యంతో తాను భూ మిని కోల్పోయానని దేశ సరిహద్దు ల్లో విధులు నిర్వహిస్తున్న బీఎస్ ఎఫ్ జవాన్ షేక్ ఖలీల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన విడుద ల చేసిన వీడియో వైరల్‌గా మారింది. తనకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ న్యాయం చేయాలని ఆ వీడియోలో కోరారు. నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన షేక్ ఖలీల్ తల్లిదండ్రులు కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. 1996లో గురుజాల గ్రామ పరిధిలో సర్వే నం 193బీలో (ఖాతా నెం. 330) రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఆయన తల్లి నబూబీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. 1996 నుంచి 2022 వరకు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్, అడంగల్‌లో వారి పేర్లే ఉన్నాయి. భూమిపై బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారు. అయితే 2022లో వైసీపీ ప్రభుత్వం చేసిన భూముల రీసర్వేలో 1.32 సెంట్లు వచ్చింది. మిగతా భూమి పక్క పొలంతో కలిసిపోయింది. రీసర్వే పుణ్యమా అని దాదాపు 0.68 ఎకరాల భూమి కోల్పోయారు. సెలవులపై వచ్చిన జవాన్ షేక్ ఖలీల్ అప్పటిలోనే మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా న్యాయం జరగలేదు. దీంతో 2022లో రెండు మూడుసార్లు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో భూమి గురించి ఫిర్యాదు చేశారు. నందవరం తహసీల్దార్ కార్యాలయం అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. గ్రామ స్థాయి అధికారులు, వైసీపీ నాయకులు కూడా న్యాయం చేయలేదు. భార్యాపిల్లలను వదలి దేశం కోసం సరిహద్దుల్లో రాత్రింబవళ్లు ప్రాణాలు ఒడ్డి విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లకు రెవిన్యూ అధికారులు చేస్తున్న న్యాయం ఇది అని జవాన్ షేక్ ఖలీల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు చేరితే అయినా తనకు న్యాయం జరుగుతుందని అందులో అన్నారు. ఈవిషయాన్ని నందరం తహసీల్దార్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా.. తనకు తెలియదని అన్నారు.

తిప్పలదొడ్డిలో చిరుత హల్‌చల్

- భయాందోళనలో గ్రామ ప్రజలు



పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కౌతాళం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలంలోని తిప్పలదొడ్డి గ్రామంలో శుక్రవారం ఓ చిరుత హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. తిప్పలదొడ్డిలోని కరిణి గ్రామ రస్తాలో ఉన్న ఓ రైతు పొలంలోని టెంకాయ చెట్టుపై చిరుత కనిపించింది. దీంతో ప్రజలు, అటుగా వెళ్తున్న కూలీలు భయభ్రాంతులకు గురయ్యారు. చిరుతను చూసేందుకు చుట్టుపక్క గ్రామాలైన కరణి, చూడి, కొలమాన్‌పేట, మల్లనహట్టి గ్రామాల ప్రజలు వందలాదిగా సమీపానికి చేరుకున్నారు. గ్రామ సర్పంచ్ మల్లయ్య కౌతాళం పోలీసులకు, ఆదోని అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అధికారులు వచ్చేలోపు చెట్టుపై ఉన్న చిరుత ప్రజలను చూసి కిందకు దూకి పారిపోతుండగా కుక్కలు వెంటపడ్డాయి. గాయపడిన కుక్కలు ప్రతిదాడి చేయగా చిరుత అక్కడి నుంచి సమీపంలోని ముళ్ల పొదల్లోకి చేరింది. అక్కడకు వచ్చిన అటవీ శాఖ ఆదోని డివిజినల్ అధికారి తేజశ్విని తమ సిబ్బందితో ఘటన స్థలం నుంచి ప్రజలను దూరంగా పంపించేశారు. అంతలోనే ముళ్ల పొదల్లో దాగి ఉన్న చిరుత బయటకు వచ్చి సమీపంలోని మరో పొలంలోకి చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

మహానందిలో ఆవుపై చిరుత దాడి

మహానంది, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం నల్లమల అటవీ క్షేత్ర పరిధిలో శుక్రవారం ఆవుపై ఓ చిరుత దాడి చేసి చంపేసింది. మండలంలోని ఎంసీ ఫారం శ్రీవెంకటేశ్వర పశుపోషణ కేంద్రానికి చెందిన ఆవులు మేతకోసం సమీపంలోని నల్లమలలోకి వెళ్లాయి. ఇందులో భాగంగా నల్లమలలోకి వెళ్లిన ఒక ఆవుపై చిరుత డాడి చేసి హతమార్చింది. ఈ విషయంపై పశుపోషణ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ధర్మారావును వివరణ కోరగా కేంద్రానికి చెందిన ఆవులమంద మేతకోసం సమీపంలోని అడవిలోకి వెళ్లాయన్నారు. ఇందులోని ఒక ఆవుపై అటవీ వన్యప్రాణి చేయడంతో మృతి చెందిందన్నారు. దాడి చేసింది చిరుతనా లేక మరేదైనా జంతువు అన్నది తెలియాల్సి ఉందన్నారు. ఆవుకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

మంత్రి చొరవతో బాంబే ఐఐటీలో సీటు



మంత్రి బీసీని కలిసిన దివ్యాంగ విద్యార్థి, ఆయన తల్లిదండ్రులు

బనగానపల్లె, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో నంద్యాల పట్టణానికి చెందిన దివ్యాంగ విద్యార్థి శబరీష్ ప్రతిష్ఠాత్మకమైన బాంబే ఐటీఐలో సీటు సంపాదించారు. తనకు సీటు కల్పించిన మంత్రి బీసీకి శుక్రవారం విద్యార్థి శబరీష్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు అరవేటి కృష్ణమూర్తి, పుష్పావతి దంపతులు అభినం దించారు. నంద్యాలకు చెందిన శబరీష్ అనే దివ్యాంగ విద్యార్థి జేఈఈ అడ్వాన్సులో ఫిజికల్ హ్యాండీ క్యాప్ కోటాలో ఆలిండియా మూడో ర్యాంకు సాధించాడు. ఇంటర్‌లో 5 సబ్జెక్టులు కాగా అతని శారీరకస్థితి బాగాలేక ఇంటర్ అకాడమీ 4 సబ్జెక్టులు చదివేందుకు ప్రత్యేక అనుమతి ఇచ్చింది. ఐఐటీలో ర్యాంకు వచ్చినా 5 సబ్జెక్టులు చదువలేదని కారణంతో సీటు ఇచ్చేందుకు ఐఐటీ బోర్డు నిరాకరించింది. ఈవిషయమై విద్యార్థి తల్లిదండ్రులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వద్ద తమ సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి బీసీ ప్రభుత్వం తరుపున బోర్డును సంప్రదించడంతో ఎట్టకేలకు బాంబే ఐఐటీలో శబరీష్‌కు సీటు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో విద్యార్థి, తల్లిదండ్రులు, శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలుసుకొని ఆయనను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల్లో కలవరం..!

(5వ పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే 2025 ఏప్రిల్ 20వ తేదిన ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా చాంద్‌బాషా చేసిన అక్రమాల గురించి ఆధారాలతో సహా వెల్లడించారు. ఆతర్వాత ఏప్రిల్ 21వ తేదిన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇంతవరకు అంతా బాగానే ఉన్నప్పటికీ అటవీ అధికారులు పూర్తిస్థాయిలో విచారించకుండా రూ.19లక్షల వరకు చాంద్‌బాషా నుంచి రికవరీ చేసినట్లు తెలిసింది. వాస్తవానికి ఓ వైపు పోలీసు స్టేషన్ కేసు నమోదైనప్పటికీ పోలీసుల ప్రమేయం లేకుండా అటవీ అధికారులు రికవరీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.4.35 కోట్ల అక్రమాలు జరిగితే పూర్తి విచారణ చేపట్టకుండా హడావిడిగా రూ.19లక్షల రికవరీ చేయడం విమర్శలకు దారితీసింది. ఆతర్వాతే ఈ వ్యవహారంలో భాగస్వాములైన నిందితులు పరారైనట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్తం

ఆత్మకూరు అటవీ శాఖను కుదిపేసిన చాంద్‌బాషా వ్యవహారంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంతో పోలీసు, అటవీ, బ్యాంకు అధికారులు మరింత అప్రమత్తమైనట్లు తెలిసింది. ప్రత్యేకించి ఈ కేసుపై తొలి నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. నిందితులను పట్టుకోవాలని ఎప్పటికప్పుడు కేసు పురోగతిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసు అధికారులు కూడా పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలావుంటే రూ.కోటి దాటే కేసులను సీఐడీకి అప్పగించే అవకాశం ఉంటుంది. కానీ పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఈ కేసును స్థానిక పోలీసులకే అప్పగించడం వల్ల దర్యాప్తు కొంత మందకొడిగా సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ కేసును సీఐడీకి అప్పగించే అవకాశం లేకపోలేదు. అదేవిధంగా చాంద్‌బాషా అక్రమాల గుట్టును పూర్తిస్థాయిలో వెలికితీసేందుకు పీసీసీఎఫ్ ఏకేనాయక్ ఆరుగురుతో కూడిన బృందాన్ని నియమించారు. అయితే ఆ బృందం ఇప్పటివరకు ఒక్కరోజు కూడా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేదని తెలిసింది. దీంతో వారు కూడా అక్రమాలపై విచారణ చేపట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



కుబేరా సినిమా తరహాలో..

చాంద్‌బాషా చేసిన అక్రమాల్లో ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. చెక్కులను దారిమళ్లించే క్రమంలో కుబేరా సినిమా తరహాలో చాంద్‌బాషా తనదైన శైలిలో అవకతవకలకు పాల్పడ్డాడు. చాంద్‌బాషాకు పరిచయస్తుడైన మహేశ్వర ప్రింటర్స్ నిర్వాహకులు వెంకట శివయ్యతో పాటు అతని భార్య, తల్లి బ్యాంకు ఖాతాలకు భారీగా ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేసి అతని నుంచి పలు దుకాణాలకు యజమానులకు మళ్లించి వారి వద్ద డబ్బు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. అదేక్రమంలో వెంకటశివయ్య వద్ద పనిచేసే శ్రీను అనే ఓ దివ్యాంగుడి ఖాతాలో కూడా సుమారు రూ.20లక్షల వరకు నగదు మళ్లించి డ్రా చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం గురించి సదరు దివ్యాంగుడైన శ్రీనుకు ఏమీ తెలియకపోవడం గమనార్హం.

అదేవిధంగా చాంద్‌బాషా వ్యవహారంలో కీలకంగా మారిన యూనియన్ బ్యాంకులో ఆర్టీజీఎస్ నెఫ్ట్ ఫారంలో కూడా చెక్కు హోల్డర్ సంతకం లేకుండా చాంద్‌బాషా, ఇతరుల సంతకాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ఆంధ్రజ్యోతి కథనంలో అప్రమత్తమైన యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారులు శుక్రవారం సాయంత్రం స్థానిక బ్రాంచ్ సిబ్బందితో సమావేశమై ఈ అంశంపై చర్చించినట్లు తెలిసింది.

అటవీశాఖకు తలవంపులు..!

ఇంతకాలం గుట్టుగా సాగుతున్న అటవీశాఖలో భారీ కుంభకోణం వెలుగుచూడటంతో ఆశాఖకు తలవంపులు వచ్చినట్లయింది. దీంతో అందులో నిజాయితీగా పనిచేసే అధికారులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రజల నుంచి అనేక రూపాల్లో వసూళ్లు చేసిన కోట్ల రూపాయల ప్రజాధనం దారిమళ్లడంపై వారు సైతం మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఈ తప్పిదాలు చోటుచేస్తున్నట్లు చెబుతున్నారు. అంతేకాదు ప్రతిఏటా జరిగే ఆడిట్‌ను కూడా సక్రమంగా చేసిఉంటే ఈ పరిస్థితులు వచ్చేవి కావని అభిప్రాయపడుతున్నారు. ఈ కేసును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సిట్ లేదా విజిలెన్స్ వంటి దర్యాప్తు సంస్థలతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ఎమ్మెల్యే కోట్ల, ఎంపీ భైరెడ్డి శబరిలకు టీడీపీ నాయకుల విజయోత్సవ ర్యాలీ

బేతంచెర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, తెలిపారు. మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యేతో పాటు ఎంపీ భైరెడ్డి శబరి శుక్రవారం పునఃప్రారంభించారు. సిమెంటునగర్ ముఖద్వారం నుంచి కార్మికులు, ప్రజలు పూలవర్షంతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో సీఈవో శేషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి కార్మికులను ఆదుకున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోట్లతో పాటు మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ ఉండటంతో ప్రజలసమస్యలను పరిష్కరించడంలో ఆమె ముందుంటారనీ తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయిన సిమెంటు ఫ్యాక్టరీ నుంచి సిమెంటు సరఫరా చేసే లారీలను ఎంపీ, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, వర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు



శ్రీశైలం చేరుకున్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ కామల్లికార్జున స్వామిని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఏడీఏల బదిలీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో ఏడీఏలను బదిలీ చేస్తూ కమిషనర్ ఢిల్లీరావు ఉత్తర్వులు ఇచ్చారు.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీ అయిన స్థానం
డి.రాజశేఖర్	నంద్యాల	కర్నూలు(ఆగ్రో)
పి.అశోకవర్ధన్‌రెడ్డి	డోన్	ఎమ్మిగనూరు (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్)
కేవీ నాగరాజు	డోన్(ఎస్‌సీ)	బద్వేల్
ఎం.సునీత	ఆలూరు	డోన్
ఎన్.సుధాకర్	నంద్యాల(డీటీసీ)	కోవెలకుంట్ల
కె.అరుణకుమారి	ఆదోని	కర్నూలు(డీటీసీ)
ఎం.చెంగల్రాయుడు	తాడిపత్రి	ఆలూరు
ఎస్.శ్రీనివాసరావు	సీకేదిన్నె(ఎంఎస్‌టీఎల్)	నంద్యాల(డీటీసీ)
బి.బాలవర్ధిరాజు	కర్నూలు(ఆగ్రో)	ఆదోని
పి.సురేష్	ప్రొద్దుటూరు	డోన్(ఎస్‌సీ)
బి.ఆంజనేయ	ఆత్మకూరు	నంద్యాల
సి.విజయశేఖర్	నందికొట్కూరు	ఆళ్లగడ్డ
ఎం.గిరీష్	కర్నూలు(డీటీసీ)	నందికొట్కూరు

డీసీఎంఎస్ బలోపేతానికి సహకరించాలి

- కలెక్టర్‌కు చైర్మన్ వినతి



కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు వివిధ ప్రయోజనాలను అందిస్తున్న జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ (డీసీఎంఎస్)ను బలోపేతం చేసేందుకు అన్ని విభాగాల అధిపతులకు ఆదేశాలు ఇవ్వాలని చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ కలెక్టర్ పి.రంజిత్ బాషాకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో శుక్రవారం చైర్మన్‌తో పాటు మేనేజర్ రాజేష్ కలెక్టర్‌ను కలిశారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు మార్క్‌ఫెడ్ ద్వారా అందించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే జనరిక్ మందులను తక్కువ ధరకే అందించేందు కోసం డీసీఎంఎస్ సంస్థ నిర్ణయించిందని, కలెక్టరేట్ ప్రాంగణంలో తమకు స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం చైర్మన్‌తో పాటు మేనేజర్ జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణను కలిశారు. ఎరువులతో పాటు రైతులకు అవసరమైన అన్ని సేవలను డీసీఎంఎస్ ద్వారా అందించే విదంగా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు చిత్తగిస్తారా..

- వ్యవసాయాన్ని ఆదుకుంటారా?
- పారిశుధ్యం మెరుగుపడేనా?
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం



కర్నూలు న్యూసిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం శనివారం నిర్వహించేందుకు జడ్పీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మంత్రి టీజీ భరత్‌తో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకానున్నారు. గత సమావేశంలో జడ్పీటీసీలు లేవనెత్తిన సమస్యలను ఈ సమావేశంలో పరిష్కరిస్తారా లేదో వేచి చూడాలి. జిల్లా పరిషత్ అధికారులు సర్వసభ్య సమావేశంలో నాలుగు శాఖల సమస్యలతో మాత్రమే అజెండా ఏర్పాటు చేశారు. ప్రధానంగా వ్యవసాయం-అనుబంధ శాఖలు, వైద్య-ఆరోగ్యం, పారిశుధ్యం, విద్య శాఖలపై సర్వసభ్యసమావేశంలో చర్చ జరగనుంది. మిగతా శాఖలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని అధికారులు హాజరవుతారని జడ్పీ అధికారులు తెలిపారు. జిల్లాలో రాయితీ విత్తనాలు అరకొరే ఇస్తున్నారు. అవి కూడా నాసిరకమే. కౌలు రైతులకు రుణాలు, పథకాలు కూడ అరకొరగానే వస్తున్నాయి. దీని కోసం 4.50 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. విద్యాశాఖలో ఆర్‌టీఈ 12(1) సి చట్టం సరిగ్గా అమలు కావడం లేదు. పారిశుధ్య కార్మికులకు గత ప్రభుత్వంలో చివరి రెండేళ్ల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. గ్రామాల్లో చెత్తను తరలించేందుకు చెత్త నిర్వహణ కేంద్రాలు అధ్వాన్నంగా ఉన్నాయి. వీటన్నిటిపై జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశంలో చర్చ జరగాల్సి ఉంది.

వాహనాల రాకపోకలకు అడ్డగింత



వాహనాలు నిలిపివేసి, పరిశ్రమ ప్రతినిధులతో చర్చిస్తున్న సీఐ, తహసీల్దార్

కొలిమిగుండ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతుల రస్తాలు, ఇతర మినహాయింపు రోడ్లను ఇష్టానుసారంగా పరిశ్రమ అవసరాలకు వాడరాదని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారికి మండల అధికారులు సూచించారు. ఇటీవల పెట్నీకోట పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న అల్ట్రాటెక్ రెండవ ప్లాంటు నిర్మాణ పనులకు రైతులు, ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించిన రహదారులను వాడుతు న్నారు. దీంతో పెద్దఎత్తున ఎర్ర దుమ్ము సమీప పంట పొలాలను కప్పివేయడంతో పాటు ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తోందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో శుక్రవారం కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు రహదారి వద్దకు చేరుకొని భారీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పరిశ్రమ కోసం నూతనంగా రోడ్డు వేసుకొని రాకపోకలను కొనసాగించాలని అధికా రులు సూచించారు. ఈరహదారిని వాడుకోవడానికి ఇండస్ట్రియల్ పార్క్ అధికారులు తాత్కాలిక అనుమతులు ఇచ్చారని పరిశ్రమ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పాణ్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాణ్యం సమీపంలోని ఎస్సార్బీసీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన షబానా (30) నంద్యాలలో పరీక్ష రాసి తన భర్త ఇద్రూస్‌బాషతో కలిసి మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే పాణ్యం సమీపంలో షబానా చున్ని మోటారుసైకిల్ చక్రంలో ఇరుక్కొని కింద పడి వెనక వైపు నుంచి వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ కిందపడి మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌క్యాప్) పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సుంకేసుల రోడ్డు, మద్దూర్‌నగర్, బి.క్యాంపు పోస్టాఫీసు నుంచి సి.క్యాంపు టీటీడీ కళ్యాణ మండపం వరకు, బి.క్యాంపు విజ్ఞాన మం దిరం ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గిరి రాజు, మనోహర్‌రెడ్డి, నరేష్, బిల్డింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా పాల్గొన్నారు.

చిన్నటేకూరులో జడ్పీ సీఈవో

కల్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి పర్యటించారు. శుక్రవారం ఆయన గ్రామాన్ని సందర్శించి చెత్తసేకరణను పరిశీలించారు. కాలనీ ప్రజల అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలతో మమేకమై పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయండి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుర్తించిన ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయాలని నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఢిల్లీ నీతి అయోగ్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, నీటి సౌకర్యాలు, స్కిల్ డెవలప్మెంట్, పోషకాహారం అందించడం, అంగన్ వాడీ కేంద్రాలు మొదలగు వాటిని వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు నీతి అయోగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ రమణా రెడ్డి పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తాపించండి: జేడీ

కోడుమూరు రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించాలని పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీని వాస్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారులో మూగజీవాలకు మందు తాపించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నట్టల నివారణ, బీమా పథకం, బ్లూటంగ్ టీకాల ప్రాముఖ్యతను వివరిం చారు. వచ్చే నెల 10వ తేదీ వరకు సామూహిక గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కోడుమూరు ఏడీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కోడుమూరు, లద్దగిరి, ప్యాలకుర్తి వైద్యశాలల పరిధిలో 64వేల జీవాలకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గొర్రెల కారులకు రుణాలు, మూగజీవాలకు టానిక్‌లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో డైరెక్టర్ మద్దిలేటి, ఏడీలు రవిప్రకాష్ రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఓర్వకల్లు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శ్యామలమ్మ, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రాజు, భాస్కర్, షంషున్నీసాలను శుక్ర వారం ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి సన్మానించారు. హెచ్‌ఎం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన పాఠశాలలో కూడా విద్యార్థులను క్రమశిక్షణ నేర్పించి విద్యాబుద్ధులను కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి



నూతన ఏడీకి బొకే అందజేస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలునాయక్, కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీ ఎం.నాగరత్నమ్మను కోరారు. శుక్రవారం యూనియన్ నాయకులు నూతన ఏడీని కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగులకు పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను అర్హతను బట్టి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఏడీ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలు నాయక్, సెక్రటరీ ఖాజా మొహిద్దీన్, సర్జెంట్ ఉరుకుందయ్య, నాయకులు పరశురాముడు, రాజు, లోకేశ్వరుడు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సి.బెళగల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సైబర్ నేరాలపై ఎస్‌ఐ పరమేష్‌నాయక్ ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్ ఫోన్‌లోని వాట్సప్‌లో వచ్చే మేసేజ్‌లను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. యువత మద్యానికి బానిస కాకుండా జాగ్రత్త పడాలని తల్లిదండ్రులకు సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

చెత్తకు చెక్

సి.క్యాంపు రైతుబజారులో చెత్తశుద్ధి కేంద్రం



సి.క్యాంపు రైతుబజారులో కూరగాయల వ్యర్థాలు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సి.క్యాంపు రైతు బజార్‌లో చెత్త సమస్యకు చెక్ పడింది. గతంలో రైతుబజార్లలో పాడైన కూరగాయలను బయటకు తరలించడం సిబ్బందికి పెద్ద సమస్యగా మారింది. ఇప్పటి దాకా ఈ పాడైన కూరగాయల నిల్వలను బయటకు తరలించేందుకు సిబ్బంది కొరతతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని శాశ్వతంగా నివారించేందు కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో రైతు బజార్లలో చెత్తశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే మొదటిసారిగా సి.క్యాంపు రైతుబజారులో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో చెత్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మే నెల 17వ తేదీన ఈ చెత్తశుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఏ విధంగా ఈ యంత్రం పని చేస్తుందో ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. ఇటువంటి చెత్తశుద్ధి కేంద్రాలను సాధ్యమైనంత తొందరలో ప్రతి రైతుబజారులోనూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఈరైతుబజారులో ఏర్పాటు చేసిన చెత్తశుద్ధి కేంద్రం వల్ల ఎన్నో ఇబ్బందులు తప్పిపోయాయనీ ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు.



సి.క్యాంపు రైతుబజారులో చెత్త శుద్ధి యంత్రం

15 రోజులకు ఎరువు..



10 కేజీల కూరగాయల వెస్టేజీ, 10 కేజీల కలప పొట్టుతో పాటు కొంత మొత్తంలో 10 చెంచాలు కెమికల్స్, అ ఇసుకను మిశ్రమంగా చేసి ఈ చెత్తశుద్ధి యంత్రంలో వేయాలి. 15 రోజులకు ఎరువు బయటకు వస్తుంది. ఈఎరువును రైతులకే తక్కువ ధరకు ప్యాకెట్లలో విక్రయించేందుకు చర్యలు తీసుకున్నాం. సి.క్యాంపు రైతుబజారులో ప్రస్తుతం ఈ చెత్తశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు అవసరమైన వసతులను ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం.

- కళ్యాణమ్మ, ఎస్టేట్ అధికారి, సి.క్యాంపు రైతు బజారు

సుపరిపాలనకు ఏడాది పూర్తి

- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిద్దాం
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనతో ఏడాది పూర్తి చేసుకుని అభివృద్ధి, సంక్షేమం వైపు ఉరకలు వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల రోడ్డులోని ఎమ్మార్ ఫంక్షన్‌హాల్లో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఏడాదిలో రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమంతోపాటు రాబోవు నాలుగేళ్లలో రాష్ట్రాభివృద్ధి కోసం అమలు చేయాల్సిన ప్రణాళికలు, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నార్ల మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మంచాలకట్ట శ్రీనివాస రెడ్డి, గోవిందరెడ్డి, ఎన్వీ.రామకృష్ణ, ఈవీ.రమణ, శైలజాయాదవ్, ఎస్ ఫిరోజ్, గంగాధర్‌గౌడ్, రాంబాబు, మధునాయక్, కేతూర్‌మధు, వాకిటి మాదేష్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శుక్రవారం గ్రీవెన్స్ డేలో భాగంగా మాధవీనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా

డాక్టర్ పీఎస్ రాజా రవికుమార్



సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుతో డాక్టర్ రాజా రవికుమార్

కర్నూలు హాస్పిటల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ రాజా రవికుమార్‌ను నియమిస్తూ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో రేడియోథెరపీ ప్రొఫెసర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ రాజా మహేంద్రవరానికి బదిలీ అయ్యారు. దీంతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు డైరెక్టర్ లేకుండా పోయారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీరాములు, క్యాన్సర్ హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి అభినందనలు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును ఆయన కలిశారు.

వాహనం ఢీకొని.. గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో రామచంద్రనగర్ వద్ద ఓ వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కుడి మోచేతి కింద అమ్రేష్ పాల్ అని పచ్చబొట్టు ఉంది. నలుపు, తెలుపు చారల షర్టు, నల్లని జీన్స్ ప్యాంటు, కుడి చేతికి స్టీల్ కడియం ఉన్నాయి. మృతుడి వివరాలు తెలిసిన వారు 9121101078కు సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీనగర్‌కు చెందిన మహేశ్వరయ్య (59) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు ఐదేళ్ల కింద ఓపెన్ హార్ట్‌సర్జరీ జరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంతో ఉన్నాడు. తరచూ గ్యాస్ట్రిక్ సమస్య, కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

గూడూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ సమావేశాన్ని శనివారం చైర్మన్ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం గట్టయ్యనగర్ ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, సుధాకరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో డీఈవో శామ్యూల్‌పాల్‌ను సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రుల కమిటీసభ్యుల కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గట్టయ్య నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 3, 4, 5 తరగతులు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న కస్తూర్బా పాఠశాలకు తరలించడం అన్యాయమన్నారు. డీఈవో స్పం దిస్తూ ప్రభుత్వ పాలసీ విధానంలో కొన్ని పాఠశాలల విలీనాన్ని రద్దు చేశామని, కొన్ని పాఠశాలలను మరొక్క పాఠశాలకు తరలించామని చెప్పారు. సీఐటీయూ నాయకుడు యేసు, విద్యార్థుల తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, గౌరి, భారతి, సుశీల, రాధమ్మ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కేకే భవన్‌లో సమ్మె స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఆంజిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్‌కోడ్‌లను అమలులోకి వస్తే కార్మికులు బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. సమావేశంలో న్యూసిటీ కార్యదర్శి సాయిబాబా, అధ్యక్షుడు నరసింహులు, రాముడు, సుధాకరప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఈ నెల 30న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం మూడో నగర మహాసభను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సం ఘం కార్యదర్శి ఖాజాపాషా అన్నారు. గడియారం ఆసుపత్రి ఎదురుగా సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసభకు భవన నిర్మాణ కార్మికులంతా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్, మహ్మద్, షేక్షావలి, లక్ష్మీ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

● 12వ వార్డు వడ్డెగేరిలో డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకుడు అబ్దుల్‌దేశాయ్ కోరారు. నాయకులతో కలిసి ఆయన వడ్డెగేరిలో పర్యటించారు. అబ్దుల్‌దేశాయ్ మాట్లాడుతూ డ్రైనేజీ పనులు పూర్తి చేయాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు కాల యాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చాంద్‌బాషా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి: ఏవో

సి.బెళగల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఏవో మాట్లా డుతూ దుకాణాల యజమానులు రైతులకు విక్రయించే వాటికి తప్ప నిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అలాగే మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, కొండాపురం, గుండ్రెవుల గ్రామాల్లోని రైతులకు ప్రభుత్వం 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను మంజూరు చేసిందన్నారు.

పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహించొద్దు

సి.బెళగల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహించొద్దని మండల ఇన్‌చార్జి ఈవోఆర్డీ సైఫుల్లా బేగ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం, కొత్తకోట, ఈర్లదిన్నె, ముడు మాల గ్రామాల్లోని చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

నిమిషాంబాదేవి ఆలయంలో పూజలు

కర్నూలు కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాతనగరంలో చిత్తారి వీధిలోని నిమిషాంబాదేవి ఆలయంలో ఆషాఢ మాస వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంద ర్భంగా అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవమూ ర్తులకు కూరగాయలతో అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే పాత నగరంలో జమ్మి చెట్టు సమీపంలోని లలితా పీఠంలో వారాహిదేవి అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. మల్లెపూలతో అమ్మవారిని అలంకరించి, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ప్రగతి సమితి వ్యవస్థాపకుడు శ్రీహర్ష

కర్నూలు కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ప్రాజెకులను పూర్తి చేయాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకుడు శ్రీహర్ష కోరారు. శుక్రవారం నగరంలోని బిర్లాగేటు సమీపంలోని సమితి కార్యాలయంలో రైతు సంఘాల జేఏసీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో జలవనరులు సమృద్ధిగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా పాలకులు ఆలోచించాలని కోరారు. ఏటా కరువు, వలసల నివారణ, పంటల సాగు జరగాలంటే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే జిల్లా సస్యశ్యామలమవుతుందని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ప్రాజెక్టుల నిర్మాణం కూడా ఎంతో అవసరమని రైతు సంఘం జేఏసీ నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, రవి, సుంకన్న, రఘులు డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి ఆవశ్యకతపై కూడా చర్చించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహర్ష

రిలయన్స్ మెగా ప్రాజెక్టుపై హర్షం

కర్నూలు అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో రిలయన్స్ మెగా ప్రాజెక్టు రావడంపై టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ, తెలుగు యువత కార్యదర్శి పేరపోగు రాజులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐపీబీ సమావేశంలో ప్రతిపాదనలకు ఆమోదం లభించడంపై ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కాకర్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

గూడూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీలో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో ఆయా కాలనీలో కుక్కలను పట్టుకున్నారు. కమిషనర్ మాటాడుతూ నగర పంచాయతీ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో కుక్కల పట్టివేతను చేపట్టామన్నారు.

రగ్బీ చాంపియన్స్ సి.బెళగల్, క్రిష్ణగిరి జట్లు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ అండర్-18, బాలుర విభాగంలో సి.బెళగల్, బాలికలను క్రిష్ణగిరి జట్లు చాంపియన్లుగా నిలిచాయి. శుక్రవారం స్థానిక ఆదర్శ విద్యామం దిర్ క్రీడా మైదానంలో పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రగ్బీ అసోసియేషన్ ప్రెసిడెంటు గుడిపలి సురేందర్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

బాలుర విభాగంలో: సి.బెళగల్ ఏపీఆర్, ఆదర్శ విద్యామందిర్, చిన్నటేకూరు ఏపీఆర్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగంలో: క్రిష్ణగిరి, డీడీపాడు ఏపీఆర్, పంచలింగాల కేజీబీవీలు వరుసగా మొదటి, రెండు, మూడు స్థానాల్లో గెలుపొందాయి.

ప్రభుత్వ భూములను కాపాడుకోవాలి: పీడీ

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు వేల ఎకరాలు ప్రభుత్వ జాబితాలో ఉండేవని వివిధ కారణాలతో ఆ భూములు అన్యాక్రాంతమై పోతున్నాయని, వీటిని కాపాడుకోవాలని నీటి యాజమాన్య సంస్థ అడిషనల్ పీడీ మాధవీలత అన్నారు. కర్నూలు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం వివిధ శాఖల ఉమ్మడి వనరుల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అపార్డ్ సంస్థ ప్రెసిడెంటు తిరుపతిరెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అడిషనల్ పీడీ డైరెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ఆర్థిక, సాంకేతికత సహకారంతో 2020 ఫిబ్రవరి నుంచి ఇప్పటి దాకా కర్నూలు, నంద్యాల జిల్లాలోని 20 మండలాల పరిధిలో ఉన్న 294 గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి పునరుద్ధరించేందుకు అపార్డ్ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. కర్నూలు జిల్లాలో 65,146 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 68 గ్రామాల్లో 32,638 ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో ఎఫ్ఈఎస్ సంస్థ రాష్ట్ర అధికారి బత్తర్ వలిసాబ్, జిల్లా అధికారి సదాశివ, రాజశేఖర్, మల్లన్న, కుమార స్వామిరెడ్డి, ధనశేఖర్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నియంత్రించవచ్చు



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, సర్పంచ్

కర్నూలు రూరల్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో క్షయ వ్యాధిని కొంతవరకు నియంత్రించవచ్చునని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో క్షయ వ్యాధికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం సర్పంచు ఆకెపోగు జయన్నతో కలిసి ఆయన విడుదల చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'టీబీ ముక్తా అభియాన్'లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్పంచు ఆకెపోగు జయన్న మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు వైద్య సదుపాయం మరింత చేరువవుతుందన్నారు.వైద్య సిబ్బంది ప్రభాకర్, కుమారస్వామి, ఇమ్రాన్, కృష్ణ వేణి, యశోధ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని బ్యాడోలి గ్రామంలో క్షయవ్యాధిపై వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి 104 వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని క్షయవ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజరు నాగప్రసన్న, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కల్లూరులో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

కల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో 1200 ఓట్లు దాటిన పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ఉన్నతాధికారులకు నివేది కలు అందజేయనున్నట్లు కల్లూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు కె.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఎన్నికల సంఘం, పాణ్యం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశాల మేరకు ఆయన మండలంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కె.ఆంజ నేయులు మాట్లాడుతూ కల్లూరు అర్బన్, రూరల్ మండలంలో మొత్తం 212 పోలింగ్ కేంద్రాలు ఉండగా 60 పోలింగ్ కేంద్రాల్లో 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లున్నట్లు గుర్తించామన్నారు. అందులో 47 బూత్ లను సమీప పోలింగ్ స్టేషన్లలోకి సర్దుబాటు చేయడానికి అవకాశం ఉందన్నారు. పోలింగ్ కేంద్రాలను సర్దుబాటు చేయడానికి వీలులేని 13 గ్రామాల్లో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పాణ్యం రిటర్నింగ్ అధికా రికి నివేదిక అందజేయనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలు

కర్నూలు అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్‌బాబు ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పగిడాల అమానుల్లాకు నియామకప్రతం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ట్రంప్‌కు సరెండర్ అయ్యారని, పాక్‌పై యుద్ధం ఆపేయడం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫల మైందని విమర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ బజారన్న, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రీ పాషా, అబ్దుల్‌హై పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో ఉషారాణి

దేవనకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఏవో ఉషారాణి అన్నారు. శుక్రవారం దేవనకొండలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచించిన ధరలకే రైతులకు ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని అన్నారు. ప్రభుత్వం నుంచి మండలానికి యూరియా, కాంప్లెక్స్ ఎరువుల 2 వేల సంచులు వచ్చిందన్నారు. కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

చెత్తను బయట పడేయకండి: డీఎల్‌పీవో



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

మద్దికెర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు చెత్తాచెదారాన్ని ఆరుబయట పడేయరాదని డీఎల్‌పీవో వీరభద్రప్ప తెలిపారు. శుక్రవారం మద్దికెర గ్రామంలోని ఆయా వీధుల్లో చెత్త సేకరణను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి వేయాలన్నారు. వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడంతో దోమల సంతతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయకుండా పంచాయతీ కార్మికులు మీఇళ్ల వద్దకు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేరు చేసి కార్మికులకు ఇవ్వడంతో చెత్త సంపద కేంద్రానికి తీసుకెళ్తామన్నారు. మండలంలోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, పంచాయతీ సభ్యులు ఎస్.లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మద్దికెర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరం లాంటిదని టీడీపీ నాయకుడు హరినాథ్‌గౌడు అన్నారు. శుక్రవారం మండలంలోని హంపా గ్రామానికి చెందిన సుభద్రమ్మ అనే మహిళకు రూ.70వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కావడంతో అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పత్తికొండ తాలుకాపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రతి పేదోడిని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటు న్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఉన్నారు.

రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

మద్దికెర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖాధికారితో మాట్లాడారు. మండలంలో మిగులు భూములు, డీపట్టా భూములు సాగుచేసే రైతులు 700 మంది దాకా రైతులు ఉన్నారన్నారు. వారందరికీ 'అన్నదాత సుఖీభవ' అందకపోతే పెట్టుబడులు ఎలా పెడతారని ప్రశ్నించారు. వ్యవసాయశాఖ అధికారి రవి మాట్లాడుతూ జిల్లా అధికారులకు నివేదికలు పంపుతామని, వచ్చిన వెంటనే రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందిస్తామన్నారు.

రేపటి నుంచి కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు

తుగ్గలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని రాంపల్లిలో కాశిరెడ్డినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాశిరెడ్డినాయన 20వ ఆరాధనోత్సవాలను ఈనెల 29నుంచి ప్రారంభమవుతాయని, ఈ వేడుకల్లో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు. భక్తులు కొండకు వచ్చేందుకు ఆర్ఎస్ పెండేకల్ అడ్డ రోడ్డు నుంచి ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటుచేశామన్నారు. 30వ తేదీన ఆరు పళ్లలోపు ఎద్దులకు రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయుడు తెలిపారు. ఈపోటీల్లో గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందిస్తారన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ఆదోని టౌన్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలకు పవిత్రమైన మొహర్రం మాసం ప్రారంభం కావడంతో పట్టణంలోని అన్ని మసీదు పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని నిజాముద్దీన్ కాలనీ కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ మునిసిపల్ కమిషనర్‌ను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా అన్ని మసీదుల్లో ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు. తాగునీటి కొరత కూడా లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని మసీదు పరిసరాలు నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయన్నారు.

హాస్టల్‌లో సన్న బియ్యం వండటం లేదు

● ఎస్ఎంసీ చైర్మన్‌కు విద్యార్థినులు ఫిర్యాదు

ఆలూరు, జూన్27(ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం సరఫరా చేసినా ఇంకా పాత బియ్యం వండుతున్నారని, అరటిపండ్లు, గుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థినులు ఎస్ఎంసీ చైర్మన్‌కు ఫిర్యాదు. పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌ను శుక్రవారం ఎస్ఎంసీ చైర్మన్ శంకర్‌నాయక్ తనిఖీ చేశారు. విద్యార్థినులతో చర్చించారు. వార్డెన్ కూడా బదిలీ కావడంతో హాస్టల్‌ను పట్టిం చుకునే వారే లేరని చైర్మన్ మండిపడ్డారు. బాలికల హాస్టల్‌లో నిబంధనలకు విరుద్ధంగా మగవారు ఉపాధ్యాయులుగా ఉన్నారని, ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చైర్మన్ తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



చికిత్స చేస్తున్న సంచార వైద్య సిబ్బంది

దేవనకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా. రఘు సుచించారు. మండలంలోని తెర్నేకల్‌లో సంచార వైద్యశాలను ఆయన తనిఖీ చేసి గ్రామస్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నీటి కాలుష్యంతో జలుబు, దగ్గు, తుమ్ముల, విరేచనాలు, దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. కాచి చల్లారిన నీటినే తాగాలన్నారు. వైద్యాధికారి డా.అరుణ జ్యోతి, సిబ్బంది శ్రీవాణి, అంగన్‌వాడీ టీచరు పద్మావతి పాల్గొన్నారు.

పరిశుభ్రత మనందరి బాధ్యత

ఆదోని రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ శుభ్రత మనందరి బాధ్యత అని నారాయణపురం సర్పంచ్ ఆరళమ్మ తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఆమె పారిశుధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కూడా తమఇంటి వద్ద చెత్తాచెదారం వేయకూడదని, కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

● భారీగా తరలివచ్చిన గుజరాతీ భక్తులు ● పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోనిలో కొనసాగుతున్న జగన్నాథుడి రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి, తదితరులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జగన్నాథ రథయాత్ర శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. రథయాత్రకు పుర ప్రముఖులు, ఆదోని అగర్వాల్, సోని, మహేశ్వరి గుజరాతీ సమాజానికి చెందిన మహిళలు భారీగా తరలివచ్చారు. స్థానిక మంగళ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి నిర్మల్ టాకీస్ మీదుగా భీమాస్ కూడలి పాత బస్టాండ్ నుంచి రుక్మిణి పాండురంగా స్వామి దేవాలయం వరకు రథయాత్ర కొనసాగింది. పూరిలో జగన్నాథ రథయాత్రను పురస్కరించుకొని స్థానిక పట్టణ ప్రజలకు జగన్నాథుని దర్శనం కోసం రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రథోత్సవంలో ఎమ్మెల్యే పార్థసారథి విట్టా రమేష్ మింటూ అగర్వాల్, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి అన్నారు. శుక్రవారం ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ 'విద్యార్థి మిత్ర'లో భాగంగా పాఠ్యపుస్తకాలు బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, కాలనీ ఎస్ఎంసీ సభ్యులు జగదీష్, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, టీచర్లు గిడ్డారెడ్డి, వీరా చంద్ర యాదవ్, నిర్మల, రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పాటించని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు సర్కిల్‌లో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టాను సారంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఫీజుల రూపంలో వసూలుచేస్తూ పుస్తకాలు దుస్తులు ప్రత్యేకంగా చెల్లించుకుంటున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఫీజుల దోపిడీని అరికట్టకపోతే తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, జయకర్, కిరణ్ మహేష్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ జేఈఈ పేరుతో వ్యాపారం

పట్టణంలోని ప్రైవేటు జూనియర్ కళాశాల ఐఐటీ జేఈఈ మెయిన్స్ నీట్‌కు శిక్షణ ఇస్తామంటూ ఫీజులు దండుకొని విద్యా వ్యాపారం చేస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ ఆరోపించారు. కళాశాల ఎదుట నిరసన తెలిపారు. పుస్తకాలు అమ్మడం నేరమని ఆరోపించారు.

పాఠశాలకు తాళం..!

● టీచర్లు రాకపోవడంతో తాళం వేసిన గ్రామస్థులు



పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్థులు

హాలహర్వి, జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో గ్రామస్థులు తాళం వేశారు. శుక్రవారం 12 గంటలైనా ఉపాధ్యాయులు రాలేదు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడికి వెళ్లిన పిల్లలంతా ఇంటి ముఖం పట్టారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 45 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో రోజుకో ఉపాధ్యాయుడు హాజరవుతూ వెళ్తుంటారు. ఈరోజు ఏకంగా ఉపాధ్యాయుడు సైతం రాకపోవడంతో పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితి సిరుగాపురం, అమ్మతాపురం గ్రామాల్లో చదువుకునే విద్యార్థులు ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బడులు మూతబడకుండా పిల్లల చదువులు ఆగిపోకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈవిషయాన్ని ఎంఈవో ఈరన్న దృష్టికి తీసుకెళ్లగా అక్కడ ఉపాధ్యాయులు లేకపోవడం వాస్తవమేనని, ప్రస్తుతం ఇన్‌చార్జిలను కొనసాగిస్తున్నామని చెప్పారు.

పార్టీలో పనిచేసే వారికే పట్టం

● ప్రతి కార్యకర్తను కాపాడుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ఇన్‌చార్జి పైనే ఉంది

● టీడీపీ ఆదోని నియోజకవర్గ అబ్జర్వర్ ధర్మరపు సుబ్బారెడ్డి

● పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నా

● నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు



మాట్లాడుతున్నటీడీపీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, జూన్27(ఆంధ్రజ్యోతి): పార్టీలో పనిచేసే వారికే పార్టీ పట్టం కడుతుందని టీడీపీ ఆదోని నియోజకవర్గ అబ్జర్వర్, ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరపు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జేబీ గార్డెన్‌లో టీడీపీ ఆదోని నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను కాపాడుకోవాల్సిన బాధ్యత ఇన్‌చార్జిపైన ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్ నుంచి కుటుంబ సాధికారులు, గ్రామ కమిటీలు, పట్టణ కమిటీలు, గ్రామ పట్టణ అధ్యక్షులను ఎన్నికల ప్రకారంగా కష్టపడి పని చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడతూ పార్టీ కోసం 43యేళ్లుగా ఏమైనా జెండా దింపకుండా పార్టీ క్రమశిక్షణతో నిరంతరంపార్టీ అభివృద్ధికి పనిచేశానని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఇన్‌చార్జి తనపై ఉందన్నారు. అందరికీ న్యాయం జరిగేలా అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరూ కలిసి ఒకే తాటిపై నడిచేందుకు అందరూ సహకరించాలని, పార్టీ ఎవరికి ఏ బాధ్యత ఇచ్చినా క్రమశిక్షతో పార్టీ లైన్ దాటకుండా అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీకి ప్రజలకు సేవలందించే విధంగా ముందుకు సాగాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని గ్రామ, పట్టణ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని, ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ బూత్ యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన ఉద్యోగం చేయాలి

● ఏవో అశోక్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ఏవో అశోక్‌కుమార్‌రెడ్డి

ఆదోని రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విలువలతో కూడిన ఉద్యోగం చేయాలని తంగడంచ ఫామ్ వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తెలిపారు. బదిలీల్లో భాగంగా ఆదోని వ్యవసాయ అధికారిగా ఉన్న అశోక్ కుమార్ రెడ్డి, నందికొట్కూరు తంగడంచ ఫామ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏడీఏ బాలవర్ధిరాజు, ఏవో సుధాకర్, టెక్నికల్ ఏవో జయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయనను కార్యాలయంలో ఘనంగా శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రైతుల నుంచి పైసా ఆశించకుండా విలువలతో కూడిన ఉద్యోగం చేయాలని సిబ్బంది సూచించారు. ముఖ్యంగా బదిలీలు సాధారణమని, సహకరించిన తోటి ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



జియో మైసూరు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు

తుగ్గలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్‌యాదవ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం జియో మైసూరు కంపెనీ కార్యాలయంలో కంపెనీ మేనేజర్ రామ్మోహన్ సోమిరెడ్డిని కలిసి విద్యావలంటీర్లను నియమించాలని వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై 14 మంది వెళ్లగా మళ్లీ 11మంది మాత్రమే కొత్త ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారన్నారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, అందుకోసం జియో మైసూరు కంపెనీ వారు విద్యా వలంటీర్ల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కంపెనీ మేనేజర్ మాట్లాడుతూ ఈవిషయాన్ని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ తాలుకా రైతు సంఘం అధ్యక్షులు బాలన్న, ఉపాధ్యాయులు హరిశంకర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇంటి పట్టాలివ్వండి : జేసీ నవ్య



మాట్లాడుతున్న జేసీ నవ్య

ఆదోని, జూన్27(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి పట్టాలివ్వాలని జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. శుక్రవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో జేసీ నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇంటి పట్టా కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ఎంత అర్హులని ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలాన్ని అర్హులైన వ్యక్తులకు ఇంటి పట్టా రూపంలో మంజూరు చేయాలని ఆదేశించారు. 65 యేళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు రేషన్ సరుకులను 30వ తేదీలోపు డోర్ డెలివరీ చేయాలన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

వెల్దుర్తి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామ రైతులకు సర్వత్రా న్యాయం చేస్తామని జిల్లా, మండల అధికారులు అన్నారు. శుక్రవారం కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఆధ్వర్యంలో ఫారెస్టు, సర్వే అధికారులు కృష్ణాపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల ఆధ్వర్యంలో వారికి గతంలో ఇచ్చిన ప్రభుత్వ పట్టాల ఆధారంగా సర్వే నిర్వహించి సబ్‌డివిజన్ ఏర్పాటుచేసి ఎల్‌పీఎం నెంబర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో సర్వేను నిర్వహించారు. గ్రామంలో 148 సర్వే నెంబరులో కొందరు రైతులకు ఎల్‌పీఎం సమస్య ఉందని, దీన్ని పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను సైతం పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శకుంతల, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ సుజాతమ్మ, సర్వేయర్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే రేషన్ పంపిణీ



వృద్ధురాలికి రేషన్ అందిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాసాచారి

ఆదోని టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండిగిరి ప్రాంతంలో నివసిస్తున్న వృద్ధులకు, దివ్యాంగులకు వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి శుక్రవారం ఇంటి వద్దనే రేషన్ సరుకులను అందించారు. ఈనెల 30వ తేదీ వరకు రేషన్ షాపు వరకు రాలేని కుటుంబాలకు ఇంటి వద్దనే రేషన్ అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి రేషన్ సరుకులు సకాలంలో అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు..

పత్తికొండ టౌన్: ప్రతినెల 26వ తేదీ నుంచి నెలాఖరి వరకు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందించాలని పత్తికొండ తహసీల్దార్ ఉసేన్‌సాహెబ్ డీలర్లకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల వద్దకు రాలేని దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే ప్రతినెలా వెళ్లి డీలర్లు ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చే సరుకులను అందించాలన్నారు. మండలంలో 38 చౌకదుకాణాలు ఉండగా, సుమారు 15 వేల రేషన్‌కార్డుదారులు ఉన్నారని, ఎలాంటి అవకతవకలు లేకుండా సరుకులను అందించాలని ఆదేశించారు.

వేమూరి రవికుమార్ ఎంపికపై హర్షం

తుగ్గలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదా రుడిగా ఎన్ఆర్ఐ వేమూరి రవికుమార్‌ను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌చౌదరి అన్నారు. శుక్రవారం అమ రావతిలో ప్రభుత్వ సలహాదారుడు వేమూ రి రవికుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసం దర్భంగా మనోహర్‌చౌదరి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికోసం కృషిచేసిన రవికుమా ర్‌కు ప్రభుత్వ సలహాదారుడిగా ఎంపిక చేయడం చాలా సంతోషమన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

ఆదోని రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న ఏ.నాగరాజు, కె.నాగరాజుకు డిప్యూటీ ఎంపీడీవోలుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. పంచాయతీ రాజ్ కమిషనర్ వీరికి పదోన్నతులు కల్పించడంతో పాటు కర్నూలు జిల్లాకే కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో సీనియర్ అసిస్టెంట్, వీరభద్రప్ప, ఏవో నాగరాజుస్వామి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సురేష్, మల్లికార్జున, మంజులతో పాటు ఎంపీడీవో విజయశేఖర్ రావు, డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్ వీరికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి : సీఐ

పత్తికొండటౌన్, జూన్27(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామాల్లో నిర్వహించే మొహర్రంకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని సీఐ జయన్న పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ మొహర్రం ప్రారంభమ వుతున్న నేపథ్యంలో నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. పీర్లచావిడిల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా మొహర్రంను నిర్వహించుకోవాలని సీఐ ప్రజలను కోరారు.

వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలి

● పత్తికొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీసాహెబ్

క్రిష్ణగిరి, జూన్27(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు వ్యవసాయ సూచనలు, సల హాలు అవసరమని వ్యవసాయాధికా రులు రైతులకు అందుబాటులో ఉం డాలని పత్తికొండ మార్కెట్‌యార్డ్ చైర్మ న్ ఆలంకొండ నబీ సాహెబ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ ఱఱఱవడటసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే 'అన్నదాత సుఖీభవ' కింద రైతులు ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తుదన్నారు. త్వరలోనే హంద్రీ నీవా ప్రధానకాల్వ వెడల్పు పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందేలా చూడాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హంద్రీనీవా అధికారులతో మాట్లాడారన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నట్టల నివారణకు చర్యలు

దేవనకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, పొట్టేళ్లు, మేకల నట్టల నివారణకు చర్యలు తీసుకొన్నునట్లు పశువైద్యాధికారి డా.ఎన్‌జి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కప్పట్రాళ్లలో నట్టల నివారణ మందును గొర్రెల పెంపకందారులకు ఉచితంగా మందు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే గడ్డివిత్తనాలు, దాణా, మినీ గోకులం షెడ్లు, పశు బీమా లాంటివి సద్వినియోగం చేసుకోవాలన్నారు. నట్టల నివారణ కార్యక్రమం వచ్చేనెల 10వ తేదీ వరకు ఉంటుందన్నారు. సిబ్బంది భాస్కర్, గ్రామస్థులు పెదకౌలుట్లయ్య, గొర్ల సుంకన్న, చెన్నప్ప, రవికుమార్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఇష్టారాజ్యం

● పని వేళలు పాటించని ఉద్యోగులు
● ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టానుసారంగా విధులకు హాజరు


సచివాలయంలో ఉద్యోగులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలకు రావాలంటే ఇబ్బందులకు గురవుతున్నారని, మండల కేంద్రాలకు వచ్చినా అధికారులు అందుబాటులో లేకపోవడంతో రోజూ తమ పనులను వదిలేసి మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాల యానికి తిరిగి సమయం వృథా చేసుకోకుండా ఆయా గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేసింది గత ప్రభుత్వం. అయితే సచివాలయంలో పనిచేసే ఉద్యోగుల తీరులో ఏమాత్రం మార్పు రావడంలేదు. ప్రజలు, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలాల్లో జనాభాను బట్టి ఒక్కొక్క పంచాయతీకి ఒకటి, రెండు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఈ సచివాలయాల్లో దాదాపు 11 శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేయాల్సి ఉంది. అయితే సచివాలయ ఉద్యోగులు మాత్రం తమకు ఇష్టం వచ్చిన సమయంలో సచివాలయాలకు వస్తూ.. పోతూ ప్రజల సమస్యలను గాలికి వదిలేశారు. సచివాలయ ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు సచివాలయాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో సచివాలయ ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. దీంతో ప్రజల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఎమ్మిగనూరు మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 23 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతుండడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతులు తమ సమస్యలు పరిష్కారం కాక సచివాలయాల ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు మండలంలోని కలుగొట్ల గ్రామంలో సాయం త్రం 4.50 గంటల సమయంలో 'ఆంధ్రజ్యోతి' సచివాలయాన్ని విజిట్ చేయగా సచివాలయంలో ఒక డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు మాత్రమే ఉన్నారు. వాస్తవానికి సచివాలయంలో 11 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. అయితే సచివాలయ ఉద్యోగులు ఎవరు ఎప్పుడు వచ్చి..ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులు, ప్రజలు తమ సమస్యల పరిష్కారం వస్తే సంబంధిత అధికారులు లేకపోవడంతో మండల కేంద్రంలో ఉన్న కార్యాలయాకు వెళ్లి తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సచివాలయ ఉద్యోగుల పనితీరు సరిగాలేదు



సచివాలయ ఉద్యోగుల పనితీరు ఏ మాత్రం సరిగాలేదు. ఎప్పుడు వస్తారో..ఎప్పుడు వెళ్తారో తెలియన పరిస్థితి ఉంది. ఏదైనా సమస్య ఉండి సచివాలయానికి వెళ్తే సంబంధిత అధికారులు లేరని తిరిగి పంపుతున్నారు. గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ మాత్రం కనిపించడంలేదు.

- గౌవగౌడ్, కలుగొట్ల

ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు



సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. రైతుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సర్వేయర్లు ఒక్క రోజు కూడా సచివాలయంలో సరిగా ఉండడంలేదు. ప్రశ్నిస్తే మాత్రం ఫీల్డ్ పనులు ఉన్నాయంటూ సింపుల్‌గా చెప్పి తప్పించుకుంటున్నారు. ఉన్నతాధికారులు సచివాలయాలను పర్యవేక్షిస్తే ఉద్యోగులు సక్రమంగా పనిచేస్తారు.

- హరిగౌడ్, కలుగొట్ల

చర్యలు తీసుకుంటాం

సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటిస్తున్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఫిర్యాదు చేయాలి. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం. ఉద్యోగులు ఎవరైన సకాలంలో రాకపోయినా.. సాయంత్రం వరకు విధుల్లో ఉండకపోయినా వారిపై చర్యలు తీసుకుంటాము.

-విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ

అప్పుల బాధ తాళలేకే రైతుల ఆత్మహత్యలు


పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

నందవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేకనే రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు అన్నారు. శుక్రవారం నందవరంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రాముడు కుటుంబ సభ్యులు, భార్య గోవిందమ్మను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చేస్తే పంటలు సరిగా పండక, పండిన పంటకు కూడా గిట్టుబాటు ధరలేక రైతులు అప్పుల బాధలో కురుకుపోయి ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు ప్రభుత్వం రూ. 20లక్షలు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామలింగుడు, మునెప్ప, నల్లన్న, అనుమంతు పాల్గొన్నారు.

గోనెగండ్లలో కొలువుదీరిన పీర్లు


గోనెగండ్లలో కొలువైన పీర్లు

గోనెగండ్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారు జామున పీర్లు ఆయా గ్రామాల్లోని చామిడిలలో కొలువుదీరాయి. కుల మతాలకు అతీతంగా గ్రామ పెద్దలు పీర్ల చావిడి దగ్గరకు వెళ్లి మేళతాళలతో ఘనంగా పీర్లను ఏర్పాటు చేశారు. దీంతో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను మండల ప్రజలు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ విజయభాస్కర్ తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రార్థనలు జరుపుకోవాలని సీఐ సూచించారు. జూలై 3న చిన్నసరిగెత్తు, 4న పగటి సరిగెత్తు, 5న పెద్దసరిగెత్తు, 6న మొహర్రం నిర్వహిస్తున్నట్లు ముజావర్లు దరగలమాబు, ముల్ల రహీంబాషా తెలిపారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

గోనెగండ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థులకు సీట్లు పంపిణీ చేసే విషయంలో అవినీతికి పాల్పడ్డారని, ఆమెపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి అఫ్రిద్, ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో)కు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మెరిట్ విద్యార్థులకు చేసిన అన్యాయంపై విద్యార్థి సంఘాల నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందుకు డీఈవో స్పందించి విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేస్తామని ప్రిన్సిపాల్‌పై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో ఉద్యమం విద్యార్థి నాయకులు తెలిపారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు


డీపీ 80 కాలువ పక్కలో ఉన్న రోడ్డుకు రైతులు సొంత డబ్బుతో మరమ్మతులు చేయించుకుంటున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని డీపీ80 కాలువ పక్కలో ఉన్న రోడ్డు మరమ్మతులకు గురవడంతో ఈ కాలువ కింద పంటలను సాగు చేసుకుంటున్న రైతులు ఆ రోడ్డుపై వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు. వర్షం వచ్చినప్పుడు రోడ్డుపై వెళ్లే సమయంలో రైతులు కిందపడి గాయాలపాలయ్యేవారు. ఎవరు పట్టించుకోకపోవడంతో రైతులే ముందుకు వచ్చి ఎవరి పొలాల వరకు వారే సొంతంగా ఖర్చు పెచ్చింది మట్టిని వేయించుకున్నారు. దీంతో గుంతలు పడ్డ రోడ్డు వాహనాలు వెళ్లేలా తయారైంది.

కోసిగి తహసీల్దార్‌గా వేణుగోపాల్

కోసిగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోసిగి తహసీల్దార్‌గా ఏ.వేణుగోపాల్ శుక్రవారం కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు కలెక్టరేట్‌లో పని చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోసిగి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది కలిసి నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు

స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢమాస శుక్రవారం విదియ శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో అర్చకులు, పండితులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. పండితులు భక్తులకు మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రూ.2.63 కోట్లతో వంతెన నిర్మాణం


కోర్టు ఆవరణలో వాష్‌రూం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

ఎమ్మిగనూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నందవరం మండలం నాగలదిన్నె- మంత్రాలయం రోడ్డులోని 1-6 కిమీ దగ్గర కొత్తగా రూ. 2.63కోట్లతో వంతెన నిర్మిస్తున్నట్లు ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో రూ. 31లక్షలతో నిర్మిస్తున్న వాష్‌రూంల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నాగలదిన్నె, మంత్రాలయం రోడ్డులో కొత్తగా వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోర్టు ఆవరణంలో నిర్మిస్తున్న వాష్‌రూంలను పరిశీలిస్తున్నామని, రెండు నెలల్లో వాష్ రూంల నిర్మాణాలు పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. చీఫ్ ఇంజనీర్ వెంట ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఈఈ దండు వెంకటేశ్వర్లు, డీఈఈ నాగరాజు, ఏఈఈ విజయనరేష్, ప్రభు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

వైద్యాధికారికి సన్మానం

కోసిగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోసిగి ప్రాథమిక వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తూ 5 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా కర్నూలుకు బదిలీ అయిన డా.మనోజ్ కుమార్‌కు శుక్రవారం కోసిగి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు రాజ్‌కిరీటి, అభిరూప్, రజిత, మౌనిక, ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో డా.మనోజ్ కుమార్‌కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులు, ఎల్లప్ప, రాముడు, జయమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, 108, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి


టీడీపీ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వార్డుల్లోను, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు పట్టణంలోని 34వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఆ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణ, ప్రధానకార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యాక్షులుగా అజామ్, తెలుగు యువత తేజ, మహిళా అధ్యక్షురాలు సావిత్రి, శివకుమారిలను ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక కుర్ని కమ్యునిటీ హాల్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వార్డు, గ్రామకమిటీల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాబీర్, మాజీ కౌన్సిలర్లు రంగస్వామి గౌడ్, మాచాని శివకుమార్,సిరాజుద్దీన్, వార్డు నాయకులు మున్నా, దేవమ్మ, చంద్రశేఖర్, పవన్ పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా దర్గా నిర్మాణం


దర్గా నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మఠాధిపతి, గురువులు

మంత్రాలయం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా దర్గాను దర్శించుకోవడం ఆధ్యాత్మికంగా మంచి పరిణామం అని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం సమీపంలో ఆదోని రోడ్డులో రహంతుల్లా, మస్తాన్ రజాప్ హైమద్, భక్తులతో నిర్మిస్తున్న గోఖార్ హుశేనీ తాతా దర్గా నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి గోఖార్ హుశేనీ దర్గా పీఠాధిపతి రహంతుల్లా ఖాద్రి, శాహాపూర్ పీఠాధిపతి పక్రుద్దీన్‌ఖాద్రిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ చేసి ఫతేహాలు చేశారు. ఈ కార్యక్రమంలో గంధం వీరయ్య స్వామి, హనుమంతు రెడ్డి, కురువ జయరాం, నరసింహులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి):: పట్టణంలోని శివన్న నగర్‌లో కిరాణా షాపులో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. కిరాణా షాపు యజమాని విష్ణు మాట్లాడుతూ ఉదయం యథా విధిగా షాపు తెరిచి చూడగా షాపులోని సరుకులు, ఫర్నిచర్, నగదు పెట్టె చెల్లాచె దురుగా పడి ఉన్నాయన్నారు. ఇది గమనించిన షాపు యజమాని లోపలికి వెళ్ళి చూడగా బయట నుండి బండలను పగల గొట్టి కిరాణం సరుకు పెట్టె అలమరాలను తోసి రూ3వేల నగదు, రూ 8వేల సిగరేట్లు, బీడీలు, 10 కేజీల కంది పప్పును దొంగలించారని తెలిపారు.మొత్తం రూ13వేల వరకు ఉంటుందని అన్నారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంత్రాలయం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ అన్నారు. శుక్రవారం మంత్రాలయం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ నాగరాజాచార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ లేకపోవడంతో పాఠశాల మైదానం మందుబాబులకు, అడ్డాగా మారిందని విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్, దివాకర్, ప్రాణేష్, వినోద్, అరుణాచారి, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలకు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాలకు చెందిన నిరుపేదలు ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు అనుమతులు జారీ చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఒక్కొక్కరికి 3 సెంట్లు ఇస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు ఉన్న వారందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్లలో రాకపోతే తమ వీర్వోలు వచ్చి విచారించి పట్టా ఇచ్చేందుకు సహకరిస్తారన్నారు. గతంలో పట్టా వచ్చి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో తీసుకోదని తెలిపారు. అలాగే అమ్మకు వందనం డబ్బులు పడకుండా భూమి ఎక్కువగా చూపిస్తే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 27 : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపుతో 52వ రోజు సమ్మె చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని 'ప్రజలకు నీరు మా కంట కన్నీరు' నే నినాదాలు చేస్తూ తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశులు, నరసింహులు, కేసన్న, రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, బాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి ద్రోహం చేస్తే క్షమించం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


మంత్రాలయంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి ద్రోహం చేసిన ఏ ఒక్కరిని క్షమించే ప్రసక్తే లేదని, పార్టీ కోసం పని చేసి దూరమైన వారు ఇప్పటికైనా దగ్గరకు వస్తే చేరదీస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మంత్రాలయం ప్రైవేటు సమావేశ భవనంలో టీడీపీ పార్టీ సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాలుగు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. నాలుగు మండలాలకు కమిటీల పరిశీలకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ టీడీపీలో వర్గాలు వద్దు, కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలను పాటిస్తూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగే విధంగా, కమిటీలో చోటు దక్కేలా ఆయా మండలాల నాయకులు తీర్మాణం చేయాలన్నారు. పార్టీకి ద్రోహం చేసే వారిని నియమిస్తే తాను తొలగిస్తాననీ అధిష్టానం కూడా వీటిపై ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. సమావేశంలో కౌతాళం మండల అబ్జర్వర్ అఫ్జల్ బాషా, కోసిగి ప్రసాద్, మంత్రాలయం మండల అబ్జర్వర్ మనోహర్, పరిశీలకులు కేసీసీ చైర్మన్ రామలింగారెడ్డి, ఎలక్షన్ అబ్జర్వర్ ఏపీ అర్బన్ ఫైనాన్స్ చైర్మన్ రామాంజనేయులు, రాకేష్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, పెద్ద ఎత్తున నాలుగు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా చూస్తా

మంత్రాలయం, నియోజకవర్గంలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగే విధంగా చూస్తానని అనంతపురం డీసీఎంఎస్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు నెట్టెం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మంత్రాలయం టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి వర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్‌స్వామి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి, ఉరుకుంద పుణ్యక్షేత్రం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ శివ మోహన్‌రెడ్డి, చెన్న బసప్ప, కొట్రేష్‌గౌడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు.

నట్టల నివారణ మందులు వేయించాలి


మందు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

గోనెగండ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, మేకలకు పొట్టేళ్లకు నట్టల నివారణ మందులను ఈ సీజన్‌లో తప్పక వేయించాలని జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా గొర్రెల పెంపకం అధికారి డాక్టర్ రవిప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో మూగజీవాలకు పలు రకాల వ్యాధులు సోకుతాయని ఈ కారణంగా మూగజీవాలు చనిపోతుంటాయన్నారు. ముందు జాగ్రత్త చర్యగా రోగాలు సోకకుండా ఉండేందుకు గాను గొర్రె, మేకల యజమానులు తమ జీవాలకు నట్టల నివారణ మందును తాగించాలని కోరారు. శుక్రవారం మండల పరిధిలోని వేముగోడు, గోనెగండ్ల గ్రామాలలోని మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు నట్టల నివారణ మందును వారు తాగించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రామచంద్ర, వీరేష్, వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి రాముడు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాల రద్దుకై జూలై 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ ఏకపక్షంగా పార్ల మెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలు సలహాలు తీసుకో కుండా 44 చట్టాలను రద్దు చేసి 29 చట్టాలుగా మార్పులు చేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలుగా ఆమోదించారన్నారు, కార్యక్రమంలో గోవర్ధనమ్మ, శైలజ, ప్రవీణ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.